




7న నారా చంద్రబాబు రాక



ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 7న నారావారిపల్లెకు రానున్నారు. నారా చంద్రబాబునాయుడు తమ్ముడు నారా రామ్మూర్తినాయుడు '11వ నెల విస్తరి' కార్యక్రమం ఈనెల ఏడో తేదీ నారావారిపల్లిలో జరగనుందని చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని తెలిపారు. కుటుంబసమేతంగా చంద్రబాబు రానున్న నేపథ్యంలో భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్పి, జాయింట్ కలెక్టర్, అడిషనల్ ఎస్పిలు భద్రతా ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఎ.రంగంపేట హైస్కూలు వెనుక భాగంలో హెలిపాడ్‌ను పరిశీలించారు.



శ్రీవారి మెట్టు చిరువ్యాపారులకు సంఘీభావం



విద్యుత్ హమాలీల వినతి

ట్రంపు సుంకాలతో జిల్లా రైతులు కుదేలు

మామిడి రైతులను నట్టేట ముంచారు

తిరుమల వేదికగా బిజెపి మతతత్వ రాజకీయం

'ప్రమాదంలో ప్రజాస్వామ్యం' సదస్సులో వక్తలు



సిపిఎం సదస్సుకు హాజరైన శ్రేణులు, మేధావులు, రాజకీయ ప్రముఖులు


ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అమెరికా అధ్యక్షులు ట్రంపు సుంకాలతో యావత్ భారతదేశం కుదేలవడమే కాకుండా, ముఖ్యంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతులపై తీవ్ర ప్రభావం పడనుందని సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ఉద్ఘాటించారు. నిత్యం కరువుతో సతమతమయ్యే చిత్తూరు, తిరుపతి జిల్లాలో ప్రత్యామ్నాయంగా పాడిపరిశ్రమను ఎంచుకుని జీవిస్తున్నారని, అలాంటి రంగంపై దిగుబడి సుంకాలను భారత ప్రభుత్వం ఎత్తివేస్తే పాడిరైతులందరూ నష్టపోవాల్సి వస్తుందన్నారు. హెరిటేజ్, దొడ్లా, అమూల్, మదర్, సంఘం డెయిరీలకు ఏమీ కాదని, వారంతా అమెరికా ఉత్పత్తులు కొనుగోలు చేసి అమ్ముకుంటారని, నష్టపోయేది పాడి రైతులేనని అన్నారు. 'డబుల్ ఇంజిన్ సర్కార్... ప్రమాదంలో ప్రజాస్వామ్యం' సదస్సు తిరుపతి రామతులసి కల్యాణ మండపంలో శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన బివి రాఘవులు మాట్లాడుతూ భారత ప్రభుత్వం దిగుమతి సుంకాలను ఎత్తివేస్తే చికెన్ కాళ్లు మనకు దిగుమతి అవుతాయని, ఈ కారణంగా పౌల్ట్రీ పరిశ్రమ పల్టీ కొట్టే ప్రమాదం ఉందన్నారు. అలానే సోయాబీన్స్, మొక్కజొన్న ఉత్పత్తులపైనా తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ట్రంపు సుంకాలను ప్రశ్నించమని మోడీని అడిగే దమ్ము ధైర్యం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేదన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజిన్ సర్కార్ అని చెబుతూ మామిడి రైతులతో డబుల్ గేమ్ ఆడిందన్నారు. పరిశ్రమలు కిలోపై ఎనిమిది రూపాయలు ఇస్తుందని, ప్రభుత్వం నాలుగు రూపాయలు ఇస్తుందని నమ్మబలికిన కూటమి ప్రభుత్వం, పరిశ్రమలు కిలోకు నాలుగైదు రూపాయలు ఇస్తున్నా కిమ్మనకుండా చేష్టలుడిగి చూస్తోందన్నారు. వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టడాన్ని సిపిఎం జిల్లా కమిటి తీవ్రంగా ఖండిస్తోందన్నారు. నిప్పుపెట్టిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 600 పాఠశాలలను విలీనం చేశారని, 44 పాఠశాలలు తీవ్ర ప్రమాద ప్రాంతాల్లో రైల్వేగేటు, జాతీయ రహదారులు దాటాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేసి కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ గత ప్రభుత్వంలోనూ, ఈ ప్రభుత్వంలోనూ అవినీతిలోనూ, అక్రమాలలోనూ, ప్రజా వ్యతిరేక విధానాల్లోనూ ఏమీ తేడా లేదన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఈ రాష్ట్రంలో ఉన్న నాలుగు పార్టీలు బిజెపికే ఓటేశాయన్నారు. 13 గంటల పని విధానాన్ని శాసనమండలిలో చట్టం చేస్తే వైసిపి వ్యతిరేక ఓటు వేసి ఉంటే బిల్లు పాస్ అయ్యేది కాదన్నారు. తిరుమలలో ఏడుకొండల స్వామి రోజురోజుకూ సామాన్యులకు దూరమవుతున్నారన్నారు. తిరుమల వేదిక చేసుకుని బిజెపి, ఆర్ఎస్ఎస్ మతతత్వ రాజకీయాలకు తెరలేపుతున్నాయన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదని, దీర్ఘకాలికంగా పోరాటాలు చేస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ సదస్సులో వేదికపై జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.పుల్లయ్య, డి.జనార్ధన్, టి.సుబ్రమణ్యం, జిల్లా నాయకులు పి.సాయిలక్ష్మి, ఎస్.జయచంద్ర, ఆర్.లక్ష్మి, రవిభగత్, హరినాథ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుల గోడు టిటిడి పట్టించుకోవాలి : బివి రాఘవులు

సామాన్యుల గోడును టిటిడి పట్టించుకోవాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు గత 408 రోజులుగా రిలేదీక్షలు చేస్తున్న శిబిరం వద్దకు విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. చిరువ్యాపారుల పట్ల కనీసం దయ, దాక్షిణ్యం లేకుండా ప్రవర్తించడాన్ని ఎవరూ హర్షించరని అన్నారు. బిఆర్ నాయుడు లాంటి మీడియా ప్రముఖులు, అనీల్‌కుమార్ సింఘాల్ లాంటి ఉన్నతాధికారి ఉన్నచోట పేదలు 408 రోజులుగా నిరసన దీక్షలు సాగించడం సమంజసం కాదన్నారు. దీక్షల్లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, యూనియన్ నాయకులు మధు, చిట్టిబాబు, చిరంజీవి, గణేష, యుగంధర్, రాంబాబు, మల్లికార్జున్, ప్రకాష్, శేఖర్ లతోపాటు పలువురు వ్యాపారులు దీక్షా శిబిరంలో పాల్గొన్నారు.

బివి రాఘవులును సత్కరించిన కెవి చౌదరి




తిరుపతిలో పార్టీ కార్యక్రమానికి హాజరైన సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులును ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవి చౌదరి సత్కరించారు. ఓ ప్రైవేట్ హోటల్లో బస చేసిన కె.వి చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్చం ఇచ్చి సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన కె.వి చౌదరిని రాఘవులు అభినందించారు. వ్యాపారుల సమస్యలు పరిష్కరించడంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి వి.నాగరాజు, జిల్లా నాయకులు కందారపు మురళి ఉన్నారు.

విద్యుత్ హమాలీల వినతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతికి విచ్చేసిన సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులకు ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న విద్యుత్ హమాలీలు తమ సమస్యలను వినతిపత్రం రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలు స్టోర్ హమాలీలుగా గత 40 సంవత్సరాలుగా తమ యవ్వన దశలో నుంచి 50 సంవత్సరాల వయసు వస్తున్నా నేటికీ కుటుంబ పోషణ కోసం సంస్థ ను నమ్ముకొని, ఎప్పుడో ఒకప్పుడు సంస్థలో విలీనం అవుతాం అని నమ్మి పనిచేస్తున్నామన్నారు. తమ సమస్యల పరిష్కారానికి గత 11 రోజులుగా తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామని తెలిపారు. అదే దారిలో వెళుతూ వస్తున్నటువంటి అధికారులు తమ కష్టాన్ని గుర్తించక, సమస్యను పరిష్కరించకపోగా అన్యాయమైన ధోరణిలో వ్యవహరిస్తున్నారు. తమ కష్టాన్ని గుర్తించి తమకు 46 వేల రూపాయలు జీతాన్ని అమలయ్యేటట్టు చూడాలని. అదేవిధంగా అధికార పార్టీ ఎమ్మెల్యేల అండ చూసుకొని ప్రైవేట్ కాంట్రాక్టర్లకు కాంట్రాక్ట్ లను కట్టబెట్టే విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వాలను తమ తరపున నిలదీసి తమకు న్యాయం జరిగేలా చూడాలని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఆరోగ్య దాస్, కుమార్, చిరంజీవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి నిప్పు



- భగ్గుమన్న అఖిలపక్ష, దళితసంఘాలు
- నిందితులను గుర్తించే పనిలో పోలీసులు

ప్రజాశక్తి - వెదురుకుప్పం

మహాత్ముడు, జాతిపిత గాంధీ జయంతి మరుసటిరోజు తెల్లవారుజామున అంబేద్కర్ విగ్రహానికి దురహంకారులు నిప్పుపెట్టి చిచ్చు రేపారు.. ఈ ఘటన చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలం దేవళంపేట ప్రధాన కూడలిలో జరిగింది. ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. కొంతవరకూ అంబేద్కర్ విగ్రహం కాలిపోయింది. దీంతో దళిత, అఖిలపక్ష నాయకులు భగ్గుమన్నారు. అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశాయి. మరోవైపు అధికార, ప్రతిపక్ష పార్టీలు రగడకు దిగాయి. ఇటు ఎంఎల్ఎ థామస్ అనుచరులు, అటు వైసిపి నేత కృపాలక్ష్మి అనుచరులు పోటాపోటీగా ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు దేవళంపేటకు చేరుకుని కేసు నమోదు చేశారు. చిత్తూరు ఎస్పి తుషార్ డూడీ ఘటనా స్థలికి చేరుకున్నారు. ఆందోళనకారులకు సర్దిచెప్పారు. శుక్రవారం ఉదయం నుంచి దేవళంపేటలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై జీడీ నెల్లూరు ఎంఎల్ఎ ఎంవి థామస్ స్పందిస్తూ దోషులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అసలేం జరిగింది..

దేవళంపేట మండలం ఓ చిన్నపాటి వాణిజ్య సముదాయం. ఇది బొమ్మయ్యపల్లి పంచాయతీ పరిధిలో ఉంది. గతంలో రోడ్డుకు ఆనుకుని పార్టీలకు అతీతంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహం పక్కనే గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని పార్టీ శ్రేణులు ఏర్పాటు చేశారు. అయితే గురువారం తెల్లవారుజామున డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయం కావడంతో దుండగులను గుర్తించలేని పరిస్థితి అని తెలిపారు. విగ్రహం కాలుతూ ఉండడంతో స్థానికులు, ఆయా పార్టీల నాయకులకు, పోలీసులకు సమాచారం అందించారు. అఖిలపక్ష నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని ఘటనను ఖండించారు. దీంతో చిత్తూరు జిల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అనుమానం ఉన్న కొంతమందిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కాలిన విగ్రహానికి అఖిలపక్షం నాయకులు గుడ్డతో కప్పేశారు.

దోషులను వెంటనే అరెస్టు చేయాలి : వైసిపి, దళితసంఘాలు

దోషులను వెంటనే అరెస్టు చేయాలని జీడీనెల్లూరు వైసిపి ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి డిమాండ్ చేశారు. తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామన్నారు. సర్పంచి చొక్కా గోవిందయ్య మాట్లాడుతూ విగ్రహ వినాశనానికి సతీష్‌నాయుడు అతని అనుచరులు పయని, తేజ, బుజ్జి, ఉమాపతిలని, వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దళితులందరూ స్థానికుల సహకారంతో ఐక్యంగా బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని వెదురుకుప్పం మండలం దేవళంపేట ప్రధాన కూడలి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జీర్ణించుకోలేని టిడిపికి చెందిన సతీష్‌నాయుడు సంతగేటుకు అడ్డుగా ఉందని, విగ్రహాన్ని తొలగించాలని పలుమార్లు ప్రయత్నించారన్నారు. స్థానికులు అడ్డుకోవడంతో వెనక్కి తగ్గారన్నారు. ఎలాగైనా అంబేద్కర్ విగ్రహాన్ని తొలగిస్తానని గతంలో సతీష్‌నాయుడు సవాల్ విసిరారని గుర్తు చేశారు. గురువారం అర్ధరాత్రి సతీష్‌నాయుడు అనుచరులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహంపై పెట్రోల్‌పోసి నిప్పుపెట్టారని ఆరోపించారు. ఈ ధర్నాలో మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి పాల్గొన్నారు. నిందితులను అరెస్టు చేయాలని ర్యాలీ నిర్వహించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా దోషులను వెంటనే అరెస్టు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బిఎం రవి ఆధ్వర్యంలో వెదురుకుప్పం ఎస్ఐకు విన్నవించారు. దోషులను శిక్షించాలని టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగ కార్యదర్శి నేషనూరు మునిచంద్రారెడ్డి కోరారు.





వైసిపి, టిడిపిల ఖండనలు

దోషులను వదిలిపెట్టేది లేదు

ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్

దోషులను ఎటువంటి పరిస్థితిలోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం చాలా హేయమైన, నీచమైన చర్య. ఇలాంటి ఘటనలు బాధాకరం. ఈ ఘటనపై చిత్తూరు జిల్లా ఎస్పీ, డిఎస్‌పితో మాట్లాడాం. కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. ఘటనకు పాల్పడిన వారు వారైనా ఎటువంటి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు.

అంబేద్కర్ అంటే ఎందుకంత కక్ష

పోటుగారి భాస్కర్, కాంగ్రెస్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అంటే కొన్ని వర్గాల వారికి ఎందుకు అంత కక్ష అని కాంగ్రెస్ నాయకులు పోటుగారి భాస్కర్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ధికారంలోకి వచ్చిన తరువాత ఇటు టిడిపి, జనసేన నాయకులు కేంద్రంలో సాక్షాత్తు హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను హేళనగా మాట్లాడుతుంటే మౌనంగా కూర్చుండిపోయారన్నారు.

దారుణ సంఘటన : మురళీకృష్ణ, పూతలపట్టు ఎంఎల్ఎ

దేవళంపేట ఘటన దారుణమని పూతలపట్టు ఎంఎల్ఎ మురళీకృష్ణ ఖండించారు. శుక్రవారం ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ జనసేన పార్టీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న, స్థానిక ఎమ్మెల్యే తామస్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో. కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టి ధ్వంసం చేశారని, ఇది అమానుషమైన ఘటన అని అన్నారు.దుండగులను గుర్తించి త్వరలోనే చట్టం ముందు నిలబెడతామని, సమాజంలోనూ మార్పు రావాలన్నారు.

పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

ఈ ఘటనలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని మాంబేడు నీటిపారుదల సంఘం అధ్యక్షులు బోడిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. ఘటనకు పాల్పడిన వారు ఎంతటివారైనా నిక్పక్షపాతంగా వ్యవహరించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ ఘటన సమాజానికి సిగ్గుచేటన్నారు.దళితుల బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.తులసిమణి, వెదురుకుప్పం మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు సువ్వాల జగదీష్‌రెడ్డి ఖండించారు.

చిత్తూరు జిల్లాలో నిరసనలు

పలమనేరు అంబేద్కర్ సర్కిల్లో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, బిఎస్‌పి, ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నూరు ఈశ్వర్, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల్‌రాజు, బిఎస్‌పి జిల్లా నాయకులు శివాజీ గోవిందు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో, కేంద్రంలో ఆర్ఎస్ఎస్ అనుబంధ ప్రభుత్వ హయాంలో భారతదేశంలో అంబేద్కర్ విగ్రహాలు లేకుండా చూడాలని చూస్తున్నారని విమర్శించారు. అంబేద్కర్ విగ్రహాలను చూసి నరేంద్రమోడీ, అమిత్‌షాలా చంద్రబాబు కూడా భయపడుతున్నారన్నారు. వీరందరికీ అంబేద్కర్ ఫోబియో పట్టుకుందన్నారు. ఇలాంటి చర్యలను మానుకోని పక్షంలో ఈ ప్రభుత్వాన్ని కూల్చే ప్రమాదాన్ని తెచ్చుకోవద్దని హెచ్చరించారు. అంబేద్కర్ విగ్రహాల వద్ద బందోబస్తు ఉంచాలన్నారు. పుంగనూరులో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్ అశోక్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కన్వీనర్

దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. మతోన్మాద బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు రక్షణ లేదన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని ప్రకటించిన బిజెపి హయాంలో నిత్యం ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇలాంటి ఘటనలపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధ్యులను అరెస్టు చేయాలి.



జాతీయ ఎస్సీ కమిషన్ సత్వర స్పందన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలంలోని దేవళంపేట గ్రామంలో డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని దహనం చేసిన ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఫిర్యాదు చేసిన రెండు గంటలలోపే కమిషన్ సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది. చిత్తూరు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు 30 రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించమని ఆదేశిస్తూ, నివేదికలో ఎఫ్.ఐ.ఆర్ వివరాలు, నమోదు చేసిన సెక్షన్లు, అరెస్టులు, చార్జ్ షీట్ స్థితి తదితర సమాచారం ఇవ్వాలని స్పష్టం చేసింది. నిర్దిష్ట గడువులో నివేదిక అందించనట్లయితే, భారత రాజ్యాంగం ఆర్టికల్ 338 ప్రకారం సివిల్ కోర్ట్ అధికారాలను వినియోగించి, సంబంధిత అధికారులను వ్యక్తిగతంగా లేదా ప్రతినిధి ద్వారా కమిషన్ ముందు హాజరు కావాలని సమన్లు జారీ చేయనున్నట్లు హెచ్చరించింది. షెడ్యూల్డ్ కులాల భద్రత, గౌరవం కాపాడటంలో కమిషన్ కట్టుబడి ఉందని, సామాజిక న్యాయం ప్రతీకలపై జరుగుతున్న దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎంపీ గురుమూర్తి స్పష్టం చేశారు.

నియోలింక్ నిరంకుశత్వం

ఎదురు తిరిగాడని కార్మికుని తొలగింపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమ నియోలింక్ నిరంకుశత్వం మరోసారి బయటపడింది. కార్మికుల పక్షాన నిలబడి యాజమాన్యానికి ఎదురు నిలిచాడన్న నెపంతో గురవయ్య అనే కార్మికుడిని విధుల నుంచి తొలగించింది. శుక్రవారం ఏ-షిఫ్టుకు వెళ్లిన గురువయ్యను గేటు వద్దనే అడ్డుకుంటూ హెచ్ ఆర్ మేనేజర్ ఒకరు దౌర్జన్యానికి దిగాడు. యాజమాన్యం నిన్ను తొలగించమందనీ, విషయాన్ని బయటపెడితే అంతు చూస్తామంటూ సదరు హెచ్ ఆర్ మేనేజర్ బెదిరించడం గమనార్హం. అంతేకాకుండా ప్రభుత్వమే తమ చేతుల్లో ఉందనీ, నీకెక్కడా ఉద్యోగం రాకుండా చేస్తామంటూ హెచ్చరించి పంపడం నియోలింక్ నిరంకుశత్వానికి నిదర్శనం. వివరాల్లోకి పోతే..

స్థానిక నియోలింక్ పరిశ్రమలో సుమారు రెండు వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. జూలై నెల నుంచి వీరి చేత 12 గంటలు పని చేయించుకుంటున్నారు. పనికి తగిన వేతనం ఇవ్వకపోవడంతో ఆగస్టు 13వ తేదీన కార్మికులంతా పరిశ్రమ ఎదుట నిరసనకు దిగారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేపట్టారు. కార్మికుల తిరుగుబాటుకు గురవయ్యతోపాటు మరో 13 మంది యువకులు నేతృత్వం వహించారు. ఇది మనసులో పెట్టుకున్న నియోలింక్ యాజమాన్యం శుక్రవారం విధులకు హాజరైన గురవయ్యను విధులనుంచి తొలగించింది. మాటవరసకైనా కారణం చెప్పకుండా దౌర్జన్యంగా బయటకు గెంటింది. విషయం బయటకు చెబితే అంతుచూస్తామంటూ బెదిరించింది. మారిన లేబర్ కోడ్ల ప్రకారం సెప్టెంబర్ నెల నుంచి 13 గంటల పని విధానానికి కూటమి ప్రభుత్వం అంగీకారాన్ని తెలిపింది. అయితే జూలై నెల నుంచే నియో లింక్ పరిశ్రమ 12 గంటల పని విధానాన్ని అమల్లోకి తెచ్చింది. మహిళల 'సమ్మతి' లేకుండానే నైట్ షిఫ్ట్‌ల్లో పనిచేయించుకుంది. గొడ్డు చాకిరి చేయించుకుని తీరా రూ.13 వేలే కార్మికుల ఖాతాలో జమ చేసింది. సాధారణంగా ఓటి డ్యూటీలను కలుపుకొని నెలకు రూ. 30 వేలు యాజమాన్యం చెల్లించాల్సి ఉంది. అయితే రూ. 13 వేలే చెల్లించడంతో కార్మికులు తిరగబడ్డారు.

డిక్సన్ కార్మికుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్థానిక డిక్సన్ టీవీల తయారీ పరిశ్రమలో ప్యాలెట్ మీద పడి యువ కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. నెల్లూరు ప్రాంతానికి చెందిన 21 ఏళ్ళ యువకుడు ఈ నెల 30వ తేదీన జాకర్ సాయంతో ప్యాలెట్ ను స్టోర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు అది ఒరిగి మీద పడింది. దీంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. యువకుడి వెన్నుముక, కాళ్లు, చేతులు విరగడంతో రేణిగుంట సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే ఈ సంఘటనను యాజమాన్యం బయటికి పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంది. సంఘటనకు సంబంధించిన దశ్యాలు సీసీ పుటేజీలో నమోదు అయ్యాయి. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని శ్రీకాళహస్తి కార్మిక శాఖ అధికారి తెలిపారు.

నియోలింక్ యాజమాన్య తీరు హేయనీయం

పి. గురవయ్య,సిఐటియు



వేలాది ఉద్యోగాలు పేరిట భూములు, నీరు, రుణాలు పొంది పరిశ్రమలు నెలకొల్పుతున్న కార్పొరేట్ యాజమాన్యాల తీరు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి. కార్మికుల హక్కుల కోసం పోరాడితే తొలగించడం, బెదిరించడం హేయనీయం. స్థానికులకే ఉద్యోగాలు అంటూ ఊదరగొడుతున్న పాలకులు, అధికారులు నియోలింక్ లాంటి పరిశ్రమల నిరంకుశత్వాన్ని ప్రశ్నించాలి. కార్మికుడు గురవయ్యకు న్యాయం చేయాలి.

నేడు 'వాహన మిత్ర'కు శ్రీకారం

- జిల్లాలో 11,869 మంది లబ్ధిదారులు..
- 17.79 కోట్లు ఆటో డ్రైవర్ల ఖాతా లోకి..

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

స్త్రీ శక్తి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు దశల వారి ఆందోళన చేశారు. దీంతో స్పందించిన ప్రభుత్వం వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు వాహన మిత్ర పథకం తీసుకొచ్చింది.. ఆటో ,టాక్సీ, మ్యాక్స్ క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి పది హేను రూపాయలు ఇవ్వాలని నిర్ణయించింది.. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం శనివారం వాహన మిత్ర కింద ఆటో డ్రైవర్ల అకౌంట్లో నగదు జమకానుంది.

తిరుపతి జిల్లాలో వాహన మిత్ర పథకం కింద 11,869 మంది ఆటో, టాక్సీ, మాక్సీ క్యాబ్ డ్రైవర్లు లబ్ధిదారులుగా ఉన్నారు. ఈ పథకం కింద ప్రతి లబ్ధిదారునికి సంవత్సరానికి 15వేల రూపాయలు ఆర్థిక సహాయం ఇవ్వనుంది. మొత్తం 17 కోట్ల 79 లక్షల 60వేల రూపాయలు ఈ లక్ష్యంతో విడుదల చేయనున్నారు. ఈ వాహన మిత్ర పథకం ద్వారా డ్రైవర్ల వాహన నిర్వహణ, బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ ఫీజులు, రోడ్డు పన్నులు వంటి ఖర్చులకు సహాయం అందుతుంది. శనివారం తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతోపాటు శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట, చంద్రగిరి, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.. తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి హాజరవుతారు. ఏడు నియోజకవర్గాల లబ్ధిదారులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

'జీఎస్టీ' బెనిఫిట్స్‌పై మాజీ ఎమ్మెల్యే ప్రచారం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



ఏపీ బ్యూటీఫికేషన్ అండ్ గ్రీనరీ ఛైర్మన్, తిరుపతి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి, తిరుపతి మాజీ ఎమ్మెల్యే మన్నూరు సుగుణమ్మ ఆద్వర్యంలో తిరుపతి పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నుండి గాంధీ రోడ్డు మీదుగా ర్యాలీగా వెళ్తూ జిఎస్టి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుగుణమ్మ, టీటీడీబోర్డు మెంబర్ పనబాక లక్ష్మీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ పరిగెడుతూ ఉందనడానికి ఏపీలోనే డబుల్ బెనిఫిట్స్ ప్రజలందరూ పొందుతున్నారన్నారు. సూపర్ 6, అండ్ జీఎస్టీ ఈ రెండు సూపర్ బెనిఫిట్స్ అన్నారు. జీఎస్టీ వల్ల ప్రతి కుటుంబానికి 15వేల రూపాయల వరకు ఆదా అయ్యిందన్నారు.



అత్యాచార నిందితులను రోడ్డుపై నడిపించుకుంటూ..

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్

ఒంటరి అమ్మాయిలు, ప్రేమ జంటలే లక్ష్యంగా నేరాలకు పాల్పడుతూ గత నెల 25వ తేది మురకంబట్టు నగర వనం (ఫారెస్టుపార్కు)లో పట్టపగలే ఓ ప్రేమ జంట రహస్య వీడియోలు చిత్రీకరించి ప్రేమికుడిని బంధించి బాలికపై సామూహికంగా అత్యాచారం చేసిన ఘటనలో నాటకీయ పరిణామాల మధ్య ఎట్టకేలకు పోలీసులు నిందితుల అరెస్టును వెల్లడించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితుల ముఖానికి మాస్కులు లేకుండా స్థానిక జిల్లా ఎస్పీ పాత కార్యాలయం నుండి జిల్లా కోర్టు వరకు రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లి రిమాండ్‌కు తరలించారు.

బాలికపై అత్యాచార ఘటనలో నిందితులుగా మురకంబట్టుకు చెందిన మహేష్, కిషోర్‌తో పాటు సంతపేటకు చెందిన హేమంత్‌గా గుర్తించిన పోలీసులు శుక్రవారం చిత్తూరు నగరంలోని చెన్నమ్మగుడిపల్లి రహదారి వద్ద వాకర్స్ అసోషియేషన్ నిర్మించిన యోగా సెంటర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. బాలికపై అత్యాచార ఘటనలో ఏ -1 నిందితుడిగా ఉన్న మహేష్ 2019లో చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక ఈవ్‌టిజింగ్ కేసులులో నిందితుడిగా ఉన్నాడు. ఏ-2 2022లో నగరంలోని ఓ వైన్‌షాపులో పనిచేస్తూ అక్కడి మద్యం బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు కేసు నమోదై వుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చిత్తూరు పోలీసులు చిత్తూరు -వేలూరు జాతీయ రహదారిపై నిందితులు సిగ్గుపడేలా ముఖానికి మాస్కులు లేకుండా రోడ్డుపై ఊరేగిస్తూ జిల్లా కోర్టులో పోలీసులు హాజరుపరిచారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని కాటూరు శుక్రవారం ఉదయం అగ్రికల్చర్ అధికారి షణ్ముగం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. చాలామంది రైతులు డ్రం సీడ్ పద్ధతిలో వరి నాట్లు వేసి ఉన్నారు. ఈ పొలాల్లో కలుపు నివారణకు సంబంధించి కౌన్సిల్ ఆక్ట్ లాంటి వీడి సైడ్స్ రైతులకు రికమెండ్ చేసి తగిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగినది. అలాగే అన్నదాత సుఖీభవకు సంబంధించి మండలంలోని రైతులందరూ ఈ కేవైసీ పెండింగ్ ఉన్న రైతులకు ఈ కేవైసీ కంప్లీట్ చేయవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారి మునిరాజా, కాటూరు ఎంపిటిసి నల్లమూరు రవి శేఖర్, ఏఈఓ రేవతి, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ షణ్ముగం పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రాంబాబు



ప్రజాశక్తి - కోట : శ్రీ కనుపూరు ముత్యాలమ్మ దేవస్థానంకు విచ్చేసిన గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌ను కర్లపూడి పంచాయతీకి చెందిన కర్లపూడి రాంబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాంబాబు ఎమ్మెల్యేతో పలు అభివృద్ధికి సంబంధించిన విషయాలను చర్చించారు.

సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గం, వడమాల పేటలో శుక్రవారం సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియా మాట్లాడుతూ జిఎస్‌టి సంస్కరణలు దేశ చరిత్రలోనే నూతన అధ్యాయమన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలకు జిఎస్‌టి సంస్కరణలు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి ప్రసాద్ కొండాపురం సచివాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. సచివాలయానికి సంబంధించిన రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు సేవలందించాలని, లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏమైనా అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సివస్తే, సంబంధిత సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శికి తెలిపి, మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసి వెళ్లాలన్నారు. ఈ తనిఖీల్లో పంచాయతీ కార్యదర్శి శిరీష, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఎగ్జామినర్‌గా సచ్చిదానందమూర్తి



ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పరీక్షా నియంత్రణకు డా.కంభంపాటి సాంబశివమూర్తి ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో నూతన పరీక్షా నియంత్రణకులుగా ఎడ్యుకేషన్ విభాగం ఆచార్యులు ఎ.సచ్చిదా నందమూర్తిని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు విశ్వవిద్యాలయం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. సాంబ శివమూర్తిని ఉద్యోగ విరమణ సందర్భంగా పలువురు సన్మానించారు.

రీసర్వేకు సహకరించండి

ప్రజాశక్తి - రామచంద్రాపురం : భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహశీల్దార్ మధుసూదన్ రావు కోరారు. శుక్రవారం మండలంలోని కమ్మపల్లి, కట్టకింద వెంకటాపురం రెవెన్యూ గ్రామాల్లో మూడో విడత భూ రీసర్వేపై కేకేవి పురం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భూ రీ సర్వేకు సంబంధించి రైతులకు నోటీసులు అందజేస్తామని తెలిపారు. రీ సర్వే ప్రక్రియలో తహశీల్దార్ అమృత మాట్లాడుతూ నోటీసులు తీసుకున్న రైతులందరూ సర్వే సమయానికి హాజరు కావాలని కోరారు. భూ రీ సర్వేతో గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రీ సర్వే ద్వారా భూమి సరిహద్దులు, ప్రభుత్వ భూములు గుర్తించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ సర్వేయర్ తరుణ్ వీఆర్వో నరసింహులు, ప్రదీప్ నాయుడు, మాజీ సర్పంచ్ రాఘవేంద్ర నాయుడు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికే గ్రామ సభలు

ప్రజాశక్తి - బాలాయపల్లి: గ్రామాల అభివృద్ధికి, ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించుకునేందుకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఇడవూరి పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టబోయే పనులను గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహించారు. బాలాయపల్లి పంచాయతీలో జరిగిన గ్రామసభలో ఎంపీడీఓ మాట్లాడుతూ ఆయా గ్రామాల అభివృద్ధికి, ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జ్యోతి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్లు ప్రారంభించిన ఎమ్మెల్యే




జెండా ఊపి ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచన మేరకు జరుగుతున్న స్వచ్ఛత హి సేవ కార్యక్రమం, గాంధీ జయంతిని పురస్కరించుకొని పుత్తూరు మున్సిపాలిటీకి 15 వ ఆర్థిక సంఘం నిధులతో, వ్యర్థాల సేకరణకు రూ.10,50,000/- చొప్పున కొన్న రెండు కొత్త ట్రాక్టర్లను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, డిఈ లోకేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ యుగంధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ డిఎస్ గణేష్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాంబు స్క్వాడ్ తనిఖీలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : వివిధ రాష్ట్రాల్లో బాంబులు పెట్టినట్లు పోలీసులకు ఈమెయిల్ ద్వారా సమాచారం రావడంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా తిరుపతి పోలీసులకు అందిన సమాచారం మేరకు వివిధ ప్రదేశాలలో ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్, విష్ణు నివాసం, శ్రీనివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, ఆర్టీసీ బస్టాండు, వెస్ట్ రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాలలో తనిఖీలు చేపట్టారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పంచాయతీలో దసరా సందర్భంగా నూతన వాటర్ ప్లాంట్ ను నిర్వాహకులు మాజీ ఉప్పుది శెట్టిపల్లి పంచాయతీ టిడిపి అధ్యక్షులు కొల్లూరి ఈశ్వరయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాతయ్య, సూరి, రవినాయుడు, పెరుమాళ్, అజిత్ భాష, గణాల రమణ, టిడిపి మహిళా నేతలు పాల్గొన్నారు.

మూగ జీవాల రోదన పట్టదా..?

■ పశు వైద్యంపై నిర్లక్ష్యం ■ అనారోగ్యంతో జీవాలు మృత్యువాత ■ రైతన్నకు నష్టం.. కష్టం ■ ఆసుపత్రులున్నా వైద్యం కరువు



పిచ్చిమొక్కలకు నిలయంగా మారిన బాలాయపల్లి పశువైద్యశాల

ప్రజాశక్తి - బాలాయపల్లి : వ్యవసాయ రంగంలో ముఖ్య భూమిక పోషించే పశువులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి పశుసంవర్ధక శాఖ ఏర్పాటు చేశారు. అయితే కొందరి నిర్లక్ష్య ధోరణితో పశువుల కోసం ఏర్పాటు చేసిన పశుసంవర్ధక శాఖ సేవలు అధ్వానంగా ఉన్నాయని పాడిపశువుల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బాలాయపల్లి, చిలమనూరు, జయంపు గ్రామాల్లో పశువైద్య కేంద్రాలు ఉండగా ఏ ఒక్క పశు వైద్యశాలలో వైద్యులు లేరని వారు ఆరోపించారు. రెడ్డి..గా జయంపు కేంద్రంలో పశువైద్యాధికారి లేకపోగా, చిలమనూరు పశువైద్యశాల వైద్యాధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. బాలాయపల్లి పశువైద్యాధికారి జిల్లాల జరిగిన బదిలీల్లో నెల్లూరు జిల్లా సైదాపురం గ్రామానికి బదిలీపై వెళ్లారు. దీంతో ఆయా పశువైద్య కేంద్రాలకు ఇన్చార్జిలను నియమించారు. ఇన్చార్జిలుగా నియమితులైన పశువైద్యులు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో తెలియడం లేదని స్థానిక రైతులు తెలిపారు. దీంతో పశు వైద్యం కోసం ప్రయివేటుగా డబ్బులు చెల్లించి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వ్యవసాయంలో యాంత్రీకరణ నేపథ్యంలో, పశువుల పాత్ర తగ్గిపోతుండటంతో పాడి పశువులు రైతులకు జీవనాధారంగా మారాయి. బాలాయపల్లి మండలంలో సాగు నీరు ఆధారంగా ఉండటంతో రైతులు గేదెలు, గొర్రెలు, మేకలు, ఆవుల పాడిపై ఆధారపడి జీవిస్తున్నారు. గత ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా రైతులకు సేవలందించేందుకు ఆర్బీకేలను నెలకొల్పింది. అయితే 15 ఆర్బీకేలకు గాను 9 ఆర్బీకేలకు మాత్రమే పశుసంరక్షణ అసిస్టెంట్‌లను నియమించారు. అటు వైద్యులు, ఇటు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రతి ఏటా పాడి పశువులు, గొర్రెలు, మేకలు చనిపోతున్నాయి. దీంతో రైతులు లక్షల రూపాయలు నష్టపోతున్నారు. సచివాలయాల పరిధిలో ఉన్న పశుసంరక్షణ అసిస్టెంట్లతో పాటు ఆయా పశు వైద్యశాలల్లో ఉన్న సిబ్బంది ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో ఎవ్వరికి తెలియని పరిస్థితి నెలకొంది. ఇరవూళ సిబ్బంది ఎవరైనా అందుబాటులో ఉండి వైద్యం చేసేందుకు వస్తే డబ్బులు ఇచ్చేవరకు పీడిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇకనైనా ఉన్నతాదికారులు స్పందించి బాలాయపల్లి మండల పశువైద్య కేంద్రాలపై దృష్టి సారించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

శ్రీ సిద్ధేశ్వర ఆలయ పాలక మండలి ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - చంద్రగిరి: తిరుపతి జిల్లా, తలకోన శ్రీ సిద్ధేశ్వర ఆలయ పాలక మండలి ప్రమాణస్వీకార మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమశేఖర్ రెడ్డి ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయగా, ఆయనతోపాటు తొమ్మిది మంది సభ్యులు పాలక మండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. జనసేన పార్టీ నేత గురుప్రసాద్ తల్లి రాజేశ్వరమ్మ సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రగిరి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ దేవర మనోహర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కలప రవి, జనసేన సీనియర్ నాయకులు గుండాల వాసు, చిన్నగొట్టిగల్లు మండల అధ్యక్షులు దూది జస్వంత్, చంద్రగిరి మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ వినోద్, భాకరాపేట పంచాయతీ ఇన్చార్జి రాజశేఖర్, రెడ్డి, విశ్వనాథ తదితరులు పాల్గొన్నారు.

మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరుపై హర్షం

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: అక్రమ మద్యం కేసులో అరెస్టయిన మిథున్ రెడ్డికి బెయిల్ రావడంపై బుచ్చినాయుడు కండ్రిగ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆరణి విద్యానాథరెడ్డి, వైసిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం తిరుపతిలోని మిధున్ రెడ్డి స్వగృహంలో ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. విద్యానాథరెడ్డి మాట్లాడుతూ మిధున్ రెడ్డి కడిగిన ముత్యంలో బయటికి వచ్చారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దశరథరామిరెడ్డి శేఖర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల విద్యకు పెద్దపీట

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కూటమి ప్రభుత్వం పేదల విద్యకు పెద్దపేట వేస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం నారాయణవనం హై స్కూల్ ప్లస్‌లో మూడు ల్యాబ్ గదులకు రూ.68.30 లక్షలతో నూతన భవనం నిర్మాణానికి ఆమన భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష క్రింద నారాయణవనం హైస్కూల్ ప్లస్‌లో ల్యాబ్ గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.68.30 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఇదేవిధంగా నియోజకవర్గంలోని అన్ని హై స్కూల్ ప్లస్ పాఠశాలలకు అదనపు గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సమగ్ర శిక్ష అధికారులకు సూచించారు. పిచ్చాటూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని అధికారులను కోరారు. ఇప్పటికే ఈ సమస్యపై ఉన్నతాధికారులతో చర్చించానని త్వరగా నిధులు కేటాయించి పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనా కోనేటిసుమన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశ మందిరం ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అన్ని వసతులతో మున్సిపల్ సమావేశ మందిరం ఏర్పాటు చేయడం జరిగిందని అదేవిధంగా పట్టణంలో కోటి రూపాయల నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని త్వరలో పట్టణంలో రెండుపూటలా మంచినీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు, పురపాలక కార్యాలయం మొదటి అంతస్తులో నిర్మించిన సమావేశ మందిరం, ఇంజనీరింగ్ విభాగం గదిని ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాలు ప్రారంభించారు. అనంతరం హాస్పటల్ రోడ్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోటి రూపాయలకు పైగా నిధులతో అనేక అభివృద్ధి పనులు శంకుస్థాపన చేస్తున్నామని త్వరలో పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సమావేశమందరం, ఇంజనీరింగ్ రూమ్ ఏర్పాటు ప్రజలకు, అధికారులకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్'

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు నిర్వహిస్తున్న 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్' కార్యక్రమంలో భాగంగా, జీఎస్టీ 2.0 ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు, కళాకారులు, వ్యాపారులకు వివరించేందుకు శ్రీసిటీలో శుక్రవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీసిటీకి చెందిన వివిధ పరిశ్రమల ప్రతినిధులు, కమ్యూనిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి పరిశ్రమల శాఖ సంయుక్త డైరెక్టర్ జి.చంద్రశేఖర్ హాజరయ్యారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్లు సుబ్బారావు, ప్రవీణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భారత్ రెడ్డి హాజరై ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ఎంతో లాభాదాయకమన్నారు. అన్ని రంగాల భాగస్వామ్యులను ప్రోత్సహించే ఈ తరహా కార్యక్రమాలను శ్రీసిటీ నిర్వహించడం ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు.

ఎంబిబిఎస్ అడ్మిషన్లలో గందరగోళం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు మండలం, పరమేశ్వర మంగళంలో కొత్తగా ప్రారంభమైన అన్న గౌరీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్లో శుక్రవారం తొలి సంవత్సరం ఎంబిబిఎస్ ప్రవేశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కౌన్సిలింగ్ సీట్ల కేటాయింపుకు సంబంధించిన వెబ్‌సైట్లు సాంకేతిక సమస్యల కారణంగా ఓపెన్ కాకపోవడంతో విద్యార్థులు తర్జనభర్జనకు గురవుతున్నారు. ఇదే సమయంలో ఫీజులు చెల్లించాల్సిందిగా, ఇవాళే చివరి తేదీగా కాలేజీ యాజమాన్యం తెలుపడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి విద్యార్థులు చేరుకోవడం వల్ల పరిస్థితి మరింత క్లిష్టమయ్యింది. ఈ అయోమయాన్ని తొలగించేలా కాలేజీ యాజమాన్యం స్పష్టమైన సమాచారం ఇవ్వాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రపంచ దేశాలలో కెల్లా అతిపెద్ద ప్రజాస్వామ్య దేశముగా చెప్పబడి భారతదేశంలో అధికారం కోసం ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకొని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తూ ఎస్సీ ఎస్టీ మైనారిటీల ఓట్లను తొలగిస్తున్నారని సిడబ్ల్యూ సి సభ్యులు గిడుగు రుద్రరాజు ధ్వజమెత్తారు. ప్రెస్ క్లబ్ లో ఆయన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. పార్లమెంటు వేదికగా రాహుల్ గాంధీ బిజెపి ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ను అడ్డుపెట్టుకొని కర్ణాటకలో తొలగించిన ఓట్లపై ఆధారాలతో వివరిస్తూ ఓట్ల దొంగతనంపై మండిపడ్డారన్నారు. ప్రజలకు రాజ్యాంగంలో కల్పించబడిన ఓటు హక్కు ద్వారా తమకు నచ్చిన నాయకున్ని ఎన్నుకునే పద్ధతిని దారి తప్పిస్తూ, తామనుకున్న వాడిని గెలిపించుకునేలా అక్రమ పద్ధతులకు బిజెపి కుట్రలకు తెరలేపిందన్నారు. ప్రజా ఉద్యమాన్ని తీవ్రతరం చేయడానికి కాంగ్రెస్ పార్టీ పిలుపునిస్తోందని, ప్రజలు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు ఇందులో భాగస్వామ్యం కావాలని కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆవరణలో సంతకాల సేకరణ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు, తిరుపతి నగర అధ్యక్షులు చిట్టిబాబు, పిసిసి ఉపాధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి, చిత్తూరు జిల్లా అధ్యక్షులు పోటుగారి భాస్కర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త ఐరాల లోకేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లెమన్ ట్రీ హోటల్ ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుచానూరు జాతీయ రహదారి వద్ద నూతనంగా నిర్మితమైన లెమన్ ట్రీ ప్రీమియర్ హొటల్ ను బుధవారం చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని, కిషోర్ కుమార్ రెడ్డి, తిరుపతి లెమన్ ట్రీ ప్రీమియర్ హొటల్ నిర్వాహకులు శీనుతో కలిసి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి హొటల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ మంచి పేరుగాంచిన ఇటువంటి లెమన్ ట్రీ హొటల్ తిరుపతిలో ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సైకం జయచంద్రరెడ్డి, మాజీ మంత్రి పరసారత్నం, టిడిపి తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మధు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం దారుణం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: జీడి నెల్లూరు నియోజకవర్గం, వెదురు కుప్పం మండలం, దేవళంపేటలో గుర్తు తెలియని వ్యక్తులు అంబేద్కర్ విగ్రహాన్ని కాల్చడం అమానుషమైన చర్య అని ఆరణి విద్యానాథ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

టైమ్ స్కేల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ టైం స్కేల్ టెక్నికల్ సంఘం నాయకులు వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శాప్ ఛైర్మన్ ఎ. రవి నాయుడుని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వర్సిటీలో సేవలు చేసినా న్యాయం జరగలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారులతో చర్చించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం సురేష్ బాబు ఈ సోమశేఖర్, ఆది కేశవ నాయుడు, అనిల్ కుమార్, ఎస్ రాజశేఖర్, దామోదర్ రెడ్డి, ఇతర టెక్నికల్ సభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

ప్రజాశక్తి - రామచంద్రపురం: యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతి రూరల్ మండలం, కూపుచంద్ర పేటలో భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభకు విచ్చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ కూపుచంద్ర పేటలో దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు నాయుడు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో, జిల్లా రెవెన్యూ అధికారుల సహకారంతో విడతల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్‌డిఓ రామ్మోహన్, తహశీల్దార్ రామాంజనేయులు నాయక్, సర్వేర్ హేమ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సిఆర్ఎస్‌లో పనిచేయటం సంతృప్తినిచ్చింది

చీఫ్ వర్క్ షాప్ మేనేజర్ దైవ సహాయం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సిఆర్ఎస్‌లో పని చేయడం చాలా సంతృప్తి ఇచ్చిందని సిఆర్ఎస్ చీఫ్ వర్క్ షాప్ మేనేజర్ దైవ సహాయం తెలిపారు. దాదాపు 3 సంవత్సరాల పాటు సేవలందించి, బెంగళూరు, ఆర్ఆర్బి ఛైర్మన్‌గా ఉద్యోగోన్నతిపై వెళుతుండటంతో స్థానిక శెట్టిపల్లి గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ప్రజాశక్తితో ముఖాముఖిలో పలు వివరాలు తెలియజేశారు. అవి వారి మాటల్లోనే.. సాధారణ రైతు కూలి కుటుంబానికి చెందిన అనంతపురం జిల్లా వజ్ర కర్నూలు గ్రామంలో సుగుణమ్మ, ఏసుదాసు దంపతులకు 1979 లో జన్మించారు. స్వగ్రామం వజ్రం కర్నూలులో 1 తరగతి నుంచి 10 తరగతి వరకూ స్కూల్ చదువు పూర్తి చేసి, ఇంటర్మీడియట్ ఉరవకొండలో, వరంగల్లో నిట్ బీటెక్ పూర్తి చేసి, రైల్వే పరీక్షలకు హాజరై అందులో మంచి ప్రతిభ సాధించి, 1999లో అసిస్టెంట్ డివిజనల్ మెకానిక్ ఇంజనీర్‌గా ఎంపికయ్యారు. ఉద్యోగంలో చేరి తొలి పోస్టింగ్ వెస్ట్ బెంగాల్‌లో అనంతరం హస్తం, బీహార్, కర్ణాటక, గూగుల్, విధులు నిర్వహించారు. అక్కడి నుంచి డీఎంఈ డివిజనల్ మెకానిక్ ఇంజనీర్‌గా పనిచేస్తూ అక్కడ రాష్ట్ర ప్రభుత్వం అప్పటి రైల్వే శాఖ మినిస్టర్ లాలూ ప్రసాద్ యాదవ్ దగ్గర నేషనల్ అవార్డు అందుకున్నారు. 2022 చీఫ్ వర్క్ షాప్ మేనేజర్ తిరుపతి బ్రాంచ్ సెలెక్ట్ అయ్యి, తిరుపతి సమీపంలోని సౌత్ సెంట్రల్ రైల్వేలోని క్యారేజీ రిపేరింగ్ షాప్ (సిఆర్ఎస్)లో మూడు సంవత్సరాలపాటు విధులు నిర్వహించారు. ఈ సమయంలో ఆయన రైల్వే వర్క్ షాప్‌లో అనేక సంస్కరణలు చేసి, రైల్వే కార్మికులకి దగ్గరగా వాళ్ల కష్టసుఖాలలో పాలుపంచుకోవడంతో, ఆయనకు స్థానిక శెట్టిపల్లి గ్రామస్తులతో విడ తీయరాని బంధం ఏర్పడింది. అయన పదోన్నతిపై, ఉద్యోగ బదిలీపై వెళ్తున్న సందర్భంగా సి ఆర్ ఎస్ శెట్టిపల్లి గ్రామస్తులు గజమాలతో, దుస్సలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఉద్యోగి కాళహస్తి ధనంజయ్, శెట్టిపల్లి ఉప సర్పంచ్ రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ బాలమురళి కృష్ణ, కృష్ణమూర్తి, శంకర్, మోహన్, గోపి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార భవన నిర్మాణాలు తొలగింపు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరంలోని న్యూ బాలాజీ కాలనీలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అదనపు అంతస్తును నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు శుక్రవారం కూల్చివేశారు. న్యూ బాలాజీ కాలనీలో అనుమతులు లేకుండా నిర్మాణాలు సాగుతున్నట్లు సమాచారం అందడంతో కమిషనర్ మౌర్య ఆదేశాల మేరకు భవనాన్ని పరిశీలించామని డిసిపీ ఖాన్ తెలిపారు. అనుమతులు లేని కారణంగా అదనపు అంతస్తును కూల్చివేశామని తెలిపారు. నగరంలో ఎవరైనా పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు మూర్తి, మధు, టిపిఓ వంశీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ అండ్ హెచ్ డిజిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ అండ్ హెచ్ డిజిటల్స్‌ను మాజీ మంత్రి పరసారత్నం, ఆ సంస్థ అధినేత విజయ్ కుమార్‌లు శుక్రవారం ప్రారంభించారు. స్థానిక ఎం ఆర్ పల్లి, వైకుంఠపురం ఆర్చి రోడ్డులోని రవికుమార్ రెడ్డి గార్డన్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన షోరూం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ ఎస్ అండ్ హెచ్‌లో ఆధునిక ఎలక్ట్రానిక్స్ వస్తువులు, అన్ని రకాల బ్రాండెడ్ కంపెనీలకు సంబంధించిన పరికరాలు లభ్యమవుతాయన్నారు. అన్ని వస్తువుల మీద క్యాష్‌బ్యాక్ ఉంటుందన్నారు. ఈ షోరూంలో తక్కువ ధరతో పాటు మంచి డిస్కౌంట్లు ఉంటాయని పేర్కొన్నారు. టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్‌లు, ఏసీలు, గ్యాస్ స్టవ్‌లు, గ్లీజర్లు, మిక్సీలు, గ్రైండర్లు, మొబైల్ ఫోన్లు, కెమెరాలు, సౌండ్ బాక్స్‌లు, వాచ్‌లు, కంప్యూటర్లు, మొదలైన అన్ని రకాల ఎలక్ట్రానిక్ వస్తువులు దొరుకుతాయన్నారు. షోరూం ప్రారంభం సందర్భంగా డిస్కౌంట్లు, ఆఫర్లు ఉన్నాయని, వినియోగదారుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఆయుధ పూజ

ప్రజాశక్తి - రామచంద్రాపురం: రామచంద్రాపురం మండలం, నెత్తకుప్పంలోని 33 కేవి విద్యుత్ ఉప కేంద్రంలో విజయదశమి పూజలను ట్రాన్స్కో సిబ్బంది ఘనంగా నిర్వహించారు. సబ్ స్టేషన్‌లో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. పరికరాలను మరమ్మత్తులు చేశారు. రంగు రంగుల పుష్పమాలికలను సింగారించారు. శ్రీ శక్తి మాతకు బొరుగులు,శనగలు,బెల్లం,స్వీట్లు ,పండ్లునెయ్యి పొంగలి నైవేద్యంగా సమర్పించి,ధూప దీప నైవేద్యాలు సమర్పించారు.దిష్టి తీసి గుమ్మడికాయ కొట్టారు.ఈ సందర్భంగా పుత్తూరు ఏ డి ఈ శంకరయ్య మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్ కూడా ఓ ఆలయం లాంటిదని చెప్పారు.ఎలాంటి మరమ్మత్తులకు గురికాకుండా విద్యుత్ సరఫరా అందించటానికి సిబ్బంది 24ఐ7 కృషి చేస్తూ ఉంటారని తెలిపారు.ప్రతి నెల మూడవ శనివారం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని రకాల లైన్లను పరిశీలించి క్రమబద్ధీకరిస్తున్నారని వివరించారు. నాణ్యమైన విద్యుత్తు అందించడానికి ట్రాన్స్ కో కట్టుబడి ఉందన్నారు.దసరా సందర్భం గా విజయదశమి పూజను ఘనంగా నిర్వహించిన రాయలచెరువు ఏఈ విఎస్ గిరిధర్, లైన్ ఇన్స్పెక్టర్ జగదీష్ నాయుడుని సిబ్బందిని అభినందించారు.

క్రైం న్యూస్

ఆర్టీసీ బస్సు ఢీకొట్టి యువకుడు మృతి



ప్రమాదంలో మృతి చెందిన శశి కుమార్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఆర్టీసీ బస్సు ఢీ కొట్టి యువకుడు దుర్మరణం పాలైన సంఘటన పట్టణంలోని మిట్టకండ్రిగ వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ మండలం, పెంకులపాడు గ్రామానికి చెందిన శశి కుమార్(24) ద్విచక్ర వాహనంలో చెర్లోపల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా గూడూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మిట్టకండ్రిగ వద్ద ఎదురుగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో సత్య కుమార్ అక్కడక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఏటీఎస్ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు జన్మ దిన వేడుకలు శుక్రవారం పట్టణ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అంజూరు నివాసం వద్ద మిత్రులు, వైసీపీ నేతల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. వైయస్సార్ విగ్రహం వద్ద వైసీపీ యూత్ సురా సురేష్, ఉత్తరాది శరవణ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు అన్నదానం చేశారు. ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. అంజూరుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పలు చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉన్నం వాసుదేవ నాయుడు, ఉన్నం నిర్మల, డాక్టర్ యశ్వంత్ రెడ్డి, కోవి చంద్రయ్య నాయుడు, వయ్యాల కృష్ణారెడ్డి, కొత్తపాటి శ్రీనివాసులు రెడ్డి, చంద్ర రాజు, పగడాల రాజు, కంట ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన రెబ్బ సునీల్ కుమార్ కుటుంబ సభ్యులు శుక్రవారం రూ. 50 వేలు విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఏఈఓ మోహన్‌కు అందజేసి నిత్యాన్నదాన పథకానికి ఖర్చు చేయాల్సిందిగా సూచించారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించారు.

లెనిన్ క్లబ్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన లెనిన్ క్లబ్‌ను రాయలసీమ కాలేజ్ ఆఫ్ ఇన్స్టిట్యూట్ అధినేత ఆనంద రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. స్థానిక వీవి మహల్ రోడ్‌లోని లెనిన్ క్లబ్ వద్ద ఆయన మాట్లాడుతూ అన్ని రకాల లెనిన్ క్లాత్‌లకు ఈ షోరూం ప్రత్యేకమైనదన్నారు. ఇక్కడ నాణ్యమైన, మన్నికైన బ్రాండెడ్ లెనిన్ క్లాత్‌లు సరసమైన ధరలకు లభిస్తాయన్నారు. తిరుపతిలో ఇది రెండో షో రూమ్ అని, మొదటి షో రూమ్ అన్నమయ్య సర్కిల్లో ఉందని వెల్లడించారు. వినియోగదారుల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ షోరూం అధినేత విద్యాసాగర్ రెడ్డి, మాజీ వీసీ రత్నయ్య, తిరుపతి క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు గోల్డెన్ ప్లాజా ప్రభాకర్, కార్యదర్శి మణి, నవీన్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాట్యంతో మైమరిపించిన హర్షిత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దసరా ఉత్సవాల్లో భాగంగా బహదూర్ పేట శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పాత్రికేయుడు సూర్యకుమార్ కుమార్తె హర్షిత భరతనాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆలయ కమిటీ నిర్వాహకులు హర్షితను ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా పేర్నాటి

ప్రజాశక్తి-కోట : వైసీపీలో సభ్యత్వం అందుకున్న నాటినుండి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డికి ఆ పార్టీలో ప్రాధాన్యత కొనసాగుతూనే ఉంది. ఆ పార్టీ అధినేత ఆదరణతో పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి రాష్ట్ర కార్యదర్శిగా, వైసిపి అధికారంలోకి రాగానే ఆయన సతీమణి విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా, ఆ తరువాత శ్యాంప్రసాద్ రెడ్డికి ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం దక్కింది. ఎమ్మెల్సీగా అపజయం పొందినప్పటికీ పార్టీ కార్యకలాపాలలో చురుకైన పాత్ర పోషిస్తూ సార్వత్రిక ఎన్నికల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆయన సేవలను గుర్తించిన వైసీపీ అధిష్టానం నేడు సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా నియమించింది. నిబద్ధత, కార్యదీక్షత, క్రమశిక్షణ, విధేయత కలిగిన ప్రజా నాయకుడు పేర్నాటికి ఆ పదవి దక్కడంతో ఆయన అనుచరులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో వాకాడు, కోటకు ప్రాధాన్యత ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వైసిపిలో పేర్నాటికి ప్రాధాన్యత ఉన్నట్లు స్పష్టమవుతోంది.

ముక్కంటి పాలకమండలి సభ్యుల నియామకం

■ పదిమంది స్థానికేతరులకు చోటు ■ ఆశావహులకు వెన్నుపోటు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుల జాబితాలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. జాబితాలో పదిమంది స్థానికేతరులు చోటు దక్కించుకున్నారు. వీరిలో ఒకరు తెలంగాణా వాసి కావడం గమనార్హం. శ్రీకాళహస్తి నుంచి దావులూరు లక్ష్మమ్మ(టీడీపీ), జీ. గోపీనాథ్ (టీడీపీ), దండి రాఘవయ్య (జనసేన), వాకచర్ల గుర్రప శెట్టి (టీడీపీ),కే.విశాల (బీజేపీ)లు ఉన్నారు. చాగణం శైలజ ప్రత్యేక ఆహ్వానితుల జాబితాలో చోటు దక్కనించుకున్నారు. తక్కినవారు స్థానికేతరులు ఉన్నారు. కూటమి నిర్ణయం ఆశావహులకు వెన్నుపోటు పొడిచినట్లయిందన్న విమర్శలు వస్తున్నాయి.

ఘనంగా గాంధీ, శాస్త్రిలజయంతి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతులు వేమన విజ్ఞాన కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన విజ్ఞాన కేంద్రం గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం ఆధ్వర్యంలో గాంధీ, శాస్త్రిల చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

గాంధీకి ఘన నివాళి..

గాంధీ జయంతి పురస్కరించుకుని గురువా రం గాంధీకి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నివాళి అర్పించారు.

ఘనంగా గాంధీజీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: వేమన విజ్ఞాన కేంద్రంలో ఘనంగా మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతులు వేమనవిజ్ఞానకేంద్రం గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం ఆధ్వర్యంలో జరిగాయి. వేమనవిజ్ఞానకేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ గాంధీజీ అహింస మార్గం తో ప్రజలను స్వాతంత్ర ఉద్యమబాటలో నడపగలిగారన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు విజయవంతం

ప్రజాశక్తి - తిరుమల:శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా ముగిశాయి. ఉత్సవాలలో చివరి ఘట్టమైన చక్రస్నానాన్ని గురువారం ఉదయం శ్రీవారి పుష్కరిణిలో శాస్త్రోక్తంగా, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో సుదర్శన చక్రత్తాళ్వార్‌కు పవిత్ర స్నానం చేయించగా, వేలాది మంది భక్తులు ఈ అపురూప దశ్యాన్ని కనులారా వీక్షించారు. దీంతో తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగిన ఉత్సవాలకు ధ్వజావరోహనంతో పరిసమాప్తి పలికినట్లయింది. ఈ బ్రహ్మోత్సవాలు విజయవంత మయ్యాయ ని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రకటించారు. ఉత్సవాల సందర్భంగా మొత్తం 5.80 లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని వెల్లడించారు. శ్రీవారి హుండీకి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ. 25.12 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు.భక్తుల సేవలోనూ టీటీడీ తన ప్రత్యేకతను చాటుకుంది. 26 లక్షల మంది భక్తులకు రుచికరమైన అన్నప్రసాదాలు అందించారు. మరోవైపు 28 లక్షలకు పైగా శ్రీవారి లడ్డూ ప్రసాదాలను భక్తులు కొనుగోలు చేశారు. అలాగే 2.42 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నట్లు ఛైర్మన్ వివరించారు. గరుడ సేవ రోజున అదనంగా 45వేల మందికి దర్శన భాగ్యం కల్పించడం విశేషం.

ఎమ్మెల్యే చొరవతో తీరిన కరెంటు కష్టాలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, పెద్ద పాలేడు పంచాయితీ ఎస్సీ కాలనీలో కొన్ని సంవత్సరాలుగా ఒక ఫేస్ కరెంటుతో కాలనీవాసుల ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను గ్రామసభలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లారు. స్పందించిన ఆదిమూలం వెంటనే సంబంధిత ట్రాన్స్కో అధికారులతో మాట్లాడి విద్యుత్ సమస్య పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా సైడ్ కాలవలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో మోతిని ఆదేశించారు. శుక్రవారం ట్రాన్స్కో అధికారి తన సిబ్బందితో వెళ్లి కాలనీలో 16 కెవి ట్రాన్స్ఫర్‌ను అమర్చారు. కరెంటు కష్టాలు తీర్చిన ఎమ్మెల్యేకు ఎంపీడీవోకు ట్రాన్స్కో సిబ్బందికి కాలనీవాసులు కృతజ్ఞతకలు తెలిపారు.

నగర పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగర పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని, స్వచ్ఛత హి సేవ లో అందరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా కార్యాలయం ఆవరణలో పారిశుధ్య కార్మికులకు రక్షణ కిట్లను కమిషనర్ ఎన్. మౌర్య, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్. సి. మునికష్ణ, కార్పొరేటర్లు బాబు, దూది కుమారి, రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర, అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రెండు వారాలపాటు నిర్వహించామని తెలిపారు. క్లీన్ గ్రీన్ ఉత్సవ్ లో భాగంగా సుమారు 14వేల మొక్కలు నాటామని తెలిపారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు.. విజయదశమి సందర్భంగా తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో గురువారం ఉదయం నిర్వహించిన పూజల్లో కమిషనర్ మౌర్య పాల్గొన్నారు. హోమంలో మౌర్య, డిప్యూటీ మేయర్ ఆర్. సి. మునికష్ణ, ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా గాంధీ జయంతి



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి సిటీ ఛాంబర్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 156వ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా తిరుపతి సబ్ జైలులో 1228వ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూషన్స్ ఛైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి, ఎలైట్ హాస్పిటల్స్ ఛైర్మన్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కొడూరు బాలసుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ గోల్డ్ అండ్ సిల్వర్ మర్చంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.వి.సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి సిటీ ఛాంబర్ అధ్యక్షుడు అయాన్ ఖాన్, వ్యవస్థాపక కార్యదర్శి వై.ఎస్.షణ్ముగం యాదవ్ మరియు సభ్యులు పూసల కరుణానిధి, ప్రొఫెసర్ స్టాన్లీ జయకుమార్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులు డాక్టర్ తిప్పారెడ్డి మాట్లాడుతూ ఖైదీల సంక్షేమం అనేది సమాజంలో చాలా ముఖ్యమైన అంశం. ఖైదీలు తమ జీవితంలో తీసుకున్న కొన్ని చెడు నిర్ణయాల కారణంగా ఇక్కడికి వచ్చారు. కానీ ఇది వారి జీవితానికి ముగింపు కాదు. జైలు శిక్ష అనుభవించే ఈ సమయంలో మీరు మీ ఆలోచనలను మార్చుకోవాలి. సమాజంలో మంచి పౌరులుగా మారడానికి సంకల్పం తీసుకోవాలి. భవిష్యత్తులో మీరు నేరాలకు దూరంగా ఉంటూ, మీ కుటుంబానికి మరియు సమాజానికి ఉపయోగపడే జీవితం గడపాలి. పశ్చాత్తాపం, ఆత్మ పరిశీలన ద్వారానే మార్పు సాధ్యం. మీలో వచ్చిన మార్పు, సమాజంలో మీకు ఒక మంచి గుర్తింపును తీసుకొస్తుందని తెలిపారు. డాక్టర్ కొడూరు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మహాత్మా గాంధీ జీవితం, త్యాగం మనందరికీ స్ఫూర్తి. అహింస, సత్యం అనే రెండు ఆయుధాలతో ఆయన మన దేశానికి స్వాతంత్ర్యం సాధించారు. స్వతంత్ర భారతదేశంలో ఆయన కలలుగన్న ఆదర్శాలు, విలువలు మనం తప్పకుండా పాటించాలి. గాంధీ గారు ఆ రోజుల్లోనే ఖైదీల సంక్షేమం గురించి ఆలోచించారు. ఖైదీలను కేవలం నేరస్తులుగా చూడకుండా, వారిని సన్మార్గంలో నడిపించి సమాజానికి ఉపయోగపడేలా చేయడం మన అందరి బాధ్యత. మీరు తిరిగి ఇంటికి వెళ్ళినప్పుడు, గాంధీ గారి ఆదర్శాలను గుర్తుపెట్టుకొని, శాంతియుతమైన జీవితాన్ని గడపాలని తెలిపారు. కెవి. సత్యనారాయణ కుటుంబం అంటే కేవలం నలుగురు కలిసి ఉండటం కాదు. అది ఒక గొప్ప బలం. మీ చర్యల వల్ల మీ కుటుంబ సభ్యులు పడే కష్టాలు, అవమానాలను గుర్తుంచుకోండి. మీరు జైలులో ఉన్నప్పుడు వారు పడే బాధ వర్ణించలేనిది. బయట మీరు ఎలాంటి జీవితం గడుపుతున్నారోనని వారు ఎప్పుడూ ఆందోళన చెందుతారు. మీరు నేర ప్రపంచం నుండి పూర్తిగా దూరంగా ఉండి, మీ కుటుంబానికి అండగా నిలబడాలి. వారి సంతోషమే మీ జీవితంలో అసలైన విజయం. మంచి మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా మీరు మీ కుటుంబానికి భద్రత, గౌరవం తీసుకురాగలరని అన్నారు. తిరుపతి సబ్ జైలు సూపరింటెండెంట్ రామకృష్ణ యాదవ్ మాట్లాడుతూ జైలులో ఖైదీల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. "ఖైదీలు కూడా సమాజంలో భాగమే. వారిలో పరివర్తన తీసుకురావడమే మా ప్రధాన లక్ష్యం. ఇందుకోసం మేము జైలులో వివిధ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ఖైదీలకు వృత్తి నైపుణ్య శిక్షణ, విద్య, ఆధ్యాత్మిక కార్యక్రమాలను అందిస్తున్నామన్నారు. తిరుపతి సిటీ ఛాంబర్ అధ్యక్ష, కార్యదర్శులు మరియు సభ్యులు ఖైదీలకు స్వీట్లు, పలహారాలు పంపిణీ చేసి సబ్ జైలు సూపరింటెండెంట్ గారికి షణ్ముగం యాదవ్ మానవ హక్కులపై రచించిన 'ఎకోస్ ఆఫ్ జస్టిస్' పుస్తక ప్రతులను అందచేశారు.

పేదలకు అన్నదానం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని గురువారం కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. స్థానిక గాంధీ రోడ్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ పి సి రాయల్ మాట్లాడుతూ బ్రిటిష్ వాళ్ళ చేతుల్లో నుంచి దేశానికి బానిస విముక్తి చేసేందుకు, శాంతి మార్గాన్ని అనుసరించి భారతదేశానికి స్వతంత్రం సాధించేందుకు గాంధీజీ నిరంతరం పాటుపడి విజయం సాధించారన్నారు. అలాంటి మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం సుమారు 1000 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామంచి శ్రీనివాస్, అజయ్ కుమార్, వరప్రసాద్, రుద్రరాజు శ్రీదేవి, బండి మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దేవీ నవరాత్రి ఉత్సవాలు



ప్రజాశక్తి - రామచంద్రాపురం:సర్వ శాంతి,శుభాల కోసం రాయల చెరువుకు ఈశాన్య సరిహద్దులో, యోగుల పర్వతం పాద పీఠంలో వెలసి ఉన్న శ్రీ శక్తి పీఠంలో మహా చండి హెూమం నిర్వహిస్తున్నట్లు అఖిల భారత హిందూ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జివిఆర్ శాస్త్రి అన్నరు. గురువారం దేవి నవరాత్రి ఉత్సవాలు శ్రీ శక్తి పీఠంలో ఘనంగా ముగిసాయి. కుర్తాళం పీఠాధిపతులు సిద్దేశ్వరానంద భారతి మహా స్వామి దివ్య ఆశీస్సులతో, శ్రీ శక్తి పీఠాధిశ్వరి మాతాజీ రమ్యానంద భారతి స్వామిణి వారి ఆధ్వర్యంలో గురువారం మహా చండీ హెూమాన్ని నిర్వహించారు. మహా చండీ మంత్రాలతో హెూమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.పీఠానికి వచ్చిన వారికి పండితులు శ్రీ మరకత శక్తి కాళీదేవి,ఉగ్ర ప్రత్యంగిరా దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. పట్టు వస్త్రాలతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్న విధాల అభివృద్ధి పథంలో పయణిస్తున్నదన్నారు.చెడుపైన మంచి సాధించే ఘన విజయంమే దసరా అని తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో భక్తులు దసరా సందర్భంగా దేవీ నవరాత్రి ఉత్సవాల నిర్వహించుకున్నారని చెప్పారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీ శక్తి పీఠం పీఠాధిస్వరి శ్రీ రమ్యానంద భారతి మహాస్వామి నికి పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాల వైస్ ఛాన్సలర్, తితిదే అన్నమాచార్య ప్రాజెక్టు మాజీ డైరెక్టర్ విభీషణ శర్మ, అపోలో హాస్పిటల్స్ ఫైనాన్స్ అధికారి భాస్కర్ రెడ్డి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సత్య సాయి స్వర్ణోత్సవ వేడుకలో ఎమ్మెల్యే నాని దంపతులు



ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి పట్టణంలోని శ్రీ సత్యసాయి మందిరంలో శ్రీ సత్యసాయి బాబా వారి స్వర్ణోత్సవ వేడుకలలో సతీసమేతంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, సుధారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీటీడీ బోర్డు మెంబర్ శ్రీ పనబాక లక్ష్మీ పాల్గొన్నారు. పునః నిర్మించిన శ్రీ సత్యసాయి మందిరాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని, పులివర్తి సుధా రెడ్డి ప్రారంభించారు. ఆలయం పునర్నిర్మాణం పూర్తయిన సందర్భంగా వేడుకలు వైభవంగా శ్రీ సత్యసాయి సేవాసమితి నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ గౌస్ బాషా,మండల నాయకులు వీరంగారి రమేష్ రెడ్డి, కొండూరు ప్రవీణ్, సక్కురు ధనంజయ్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, ఎంయె నాయకులు, కూటమి సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా బాపూజీ జయంతి వేడుకలు



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో గురువారం ఉదయం ఘనంగా మహాత్మా గాంధీ జయంత వేడుకలు జరుపుకున్నారు సందర్భంగా అధికారులు మండల పార్టీ సీనియర్ నాయకులు, ఆల్ ఇండియా సోనియా గాంధీ విచార్ మంచ్ ఆంధ్ర ప్రదేశ్ ఛైర్మన్, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ అర్జునా గురుమూర్తి గారు, మాజీ డిసిసి సెక్రెటరీ రాజేంద్ర కాంగ్రెస్ పార్టీ తడ మండలం సీనియర్ నాయకులు అధ్యక్షతన ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక. అనంతరం బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి జై బోలో మహాత్మా గాంధీ కి జై అంటూ నినాదాలతో నివాళులర్పించి మిఠాయిలను పంచిపెట్టారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,మోహన్ దాస్ కరంచంద్ గాంధీ (అక్టోబరు 2, 1869 %–% జనవరి 30, 1948) ఆంగ్లేయుల పాలననుండి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన నాయకులలో అగ్రగణ్యుడు అని చెప్పారు. ప్రజలు అతన్ని మహాత్ముడని, జాతిపిత అని గౌరవిస్తారనీ సూచించారు. సత్యము, అహింసలు గాంధీ నమ్మే సిద్ధాంత మూలాలని అన్నారు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహము అతని ఆయుధాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మండల స్థాయి అధికారులు పోలీసు సిబ్బంది మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రాకకు ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - చంద్రగిరి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 7న నారావారిపల్లెకు రానున్న సందర్భంగా ఏర్పాట్లను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పరిశీలించారు. ముఖ్యమంత్రి తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడు 11వ నెల విస్తర కార్యక్రమం ఈనెల ఏడవ తేదీన నారావారిపల్లెలో జరగనుంది. ఈ కార్యక్రమానికి సీఎం కుటుంబ సమేతంగా నారావారిపల్లికి రానుండడంతో అన్నీ జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, అడిషనల్ ఎస్పీలతో కలిసి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎ.రంగంపేట హై స్కూల్ వెనుక భాగంలో హెలిపాడ్‌ను, రామ్మూర్తి నాయుడు ఘాట్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి, పలు సూచనలు ఎమ్మెల్యే తెలియజేసారు. ఈ కార్యక్రమానికి నారావారిపల్లి గ్రామానికి వచ్చే అభిమానులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా... ట్రాఫిక్ అంతరాయం లేకుండా, పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసుకోవాలని పోలీసు అధికారులకు ఎమ్మెల్యే తెలిపారు. వచ్చే ప్రజలకు భోజనం, తాగునీరు కొరత లేకుండా చూడాలని స్థానిక నాయకులకు ఎమ్మెల్యే తెలియజేసారు. గ్రామ పరిసరాలు మొత్తం, రోడ్డు ఇరువైపులా శానిటేషన్ చేయాలని అధికారులకు ఎమ్మెల్యే తెలియజేసారు.